"అబ్బాయి! నీవు వెళ్ళేముందు ఒక్కమాట చెప్పాలి" అని రాజు అందుకొన్నాడు.

"నేనైతే అదృష్టరావు చెప్పిన మాటవినను. ఆతగాడు ఏది సాధ్యం అవుతుందో ఏది అసలు సాధ్యం కానేకాదో చెప్పలేదు. వాడికి వాస్తవంగా జరుగుతున్న దానికి అసలు జరగవలసిన దానికీ తేడాఏమీ తెలియదు. అటువంటివాడిని నమ్ముకుంటే జాగ్రత్త! కుక్కతోకపట్టుకొని గోదావరి ఈదినట్టే!" అని వెళ్ళిరమ్మన్నాడు రాజు దీవించినట్టు.

రాజకుమారుడు రాజుగారినీ, తరవాత విన్నారావునీ చూచాడు. కన్నారావు వుంటాడనుకొంటున్న చోటుకూడా పరికించి చూశాడు.

"వస్తాను. మళ్ళీ అన్నిగడియారాలూ అయిదు గంటలు కొట్టేసమయానికి" అని ఆ రాజకుమారుడు ఆ గదివిడిచిపెట్టి బయటికి వెళ్ళాడు. రాజూ, విన్నారావు, కన్నారావు ఒకటే నవ్వు, వెర్రి నవ్వు! ఆ నవ్వు తలుపుదాకా, చీడీలుదిగి చీకటిలోకి ప్రవేశించేదాకా వినిపిస్తూనే ఉంది.

కోటదాటి కొన్ని అడుగులు వేసినతరవాత తల యెత్తిచూశాడు రాజకుమారుడు—పైని మేడలో వెలుతురు కనిపించే కిటికీవైపు. ఆ కిటికీ వెనుక రాజకుమారి సురవింద నిలుచుండి చూస్తున్నట్లు అనిపించింది. కదలబోతూ ఉంటే అతని కాళ్ళ ముందు ఒక గులాబీపువ్వు వచ్చిపడింది. అది తీసుకొని కళ్ళకద్దుకొని ముద్దుపెట్టుకొన్నాడు.

ఆ నల్ల చందనపు చీకటి కోణంలో రాజూ, విన్నారావు, కన్నారావూ నవ్విన వెకిలినవ్వు మరింత ఎక్కువై తరవాత తగ్గిపోయింది.

(ఇంకావుంది)

---

క థా ని క

# ఇజాలమధ్య నిజాలు

"రమణశ్రీ"

సిద్ధేశ్వర్రావు సిద్ధేశ్వరం ప్రాజెక్టుగాని, నందికొండ, గండికోట ప్రాజెక్టులకిగాని సంబంధించిన మానవమాత్రుడు కాడు. కాగా నిజంగా, జీవితం అడుగడుగునా, సంసారపు ప్రాజెక్టులు కట్టుకొంటున్న అల్పజీవి!—"ఇ"జాలకి సంబంధించిన మనిషి! ఫాసిజం, సర్రియలిజం, రాడికలిజం, కేపటలిజం, కమ్యూనిజం, మొదలైన "ఇజా"లకి బంధం పంథా వహించిన, ఘటికాగ్రణి, ఉపన్యాస, విన్యాసరంగద్రామణి, పాంచభౌతిక సముద్భూత జీవనప్రాణి!

సిద్ధేశ్వర్రావు, ఇజాలన్నీ నేరుగా నేర్చుకోదగినవింకా, లేవనే కారణం? సర్వసంగ్రహణ పరిశీలనాదక్షతలో, అన్నింటికీ బాధ్యత వహించిన "ఇజా"లని, మేతమేసి, నెమరేసి పారేయడమే! సిద్ధేశ్వర్రావుద్వారా "ఇజా"ల సాంగత్యం పరిపూర్ణంగా అంటినట్టుగాని, అంటించుకున్నట్టుగాని, సుందరమ్మకి అవుపించదు! అందుకనే సిద్ధేశ్వర్రావుమీద రుసరుసలాడుతూ, "మీ 'ఇజా'ల గొడవ ఇజార్ల గొడవ నాకెందుకు? మీరేలా ఉపన్యాసాలిచ్చి, ఊరేగితే నాకేం? ఇంటినిండా కావలసినన్ని పప్పూ, ఉప్పూ, బియ్యం, ఆవాలు, చింతపండు—ఒకటేమిటి? కావలసిన అపరాలూ, అవసరాలూ తెచ్చిపారేసి మీ యిష్టంవచ్చినట్టు "ఇజా"లమీద ఊరేగండి! పిల్లవాడికి గ్లాక్సో డబ్బాలూ, పాలడబ్బాలూ అవీ తెచ్చి పారేయండి! కన్నాక- పెంచక తప్పుతుందా?" అనేది.

సిద్ధేశ్వర్రావు, అప్పుడు సుందరమ్మ మీద కమ్యూనిజాన్ని బలప్రయోగం చేసేవాడు. సుందరమ్మ కమ్యూనిజాన్ని, సిద్ధేశ్వరిజాన్ని తెగతిట్టిపోసేది. మనదంతా నాసి గవర్నమెంటు. డెబ్భై రూపాయల బ్యాంకు నౌకరీలో, హిరణ్యాక్ష వరాలన్నీ కోరితే ఎక్కడ తేనసేవాడు. అయితే, ఎందుకు? —సంసారం—సంతానం! దిగంబర బైరాగుల్లో కలిసిపోదామనే, ఆలోచన ఎప్పటికప్పుడు, దూరంగా తోసిపారేసి, సుందరమ్మ

సుందరవదనారవిందాన్ని చూచి, సువాసనావిలమైన నిట్టూర్పువిడిచేవాడు.

ఇప్పటికప్పుడే, నాలుగు సంవత్సరాలయిందో లేదో కాపరానికొచ్చి. నలుగురు సంతానంలో, ముగ్గురు కట్నాలతోగాని, కదలని ఆడపిల్లలు. ఒక మగ నాయకుడు! ఒకోఅప్పుడు వాళ్లు నలుగురూ, రోషంగా మమ్మల్నెందుకు కన్నావ్? అన్నట్టు చూచేవారు. సిద్ధేశ్వర్రావుకి ఒకోసారి మొహం మొత్తుకోవాలనిపించేది. చిరిగిపోయిన చొక్కాని తీవ్రంగాచూచి, ఇంకా బాగా చింపి, మూలకి విసిరిపారవేయడానికి జంకేవాడుకాడు.

ఓనాటి సాయంత్రంవేళ ఆఫీసునుంచి ఇంటికి రాగానే, సుందరమ్మ మొహంలో, వింతవింత సొంత సొగసు కనిపించింది.

“ఏవిఁటే సంగతి?”అన్నాడు సిద్ధేశ్వర్రావు.

“జీతం అందిందా? అయితే లోధ్రగాని, గర్భిణీ టానిక్కుగాని తెచ్చియ్యండి”అంది.

సిద్ధేశ్వర్రావు ఇంతకంటె పిడుగు నెత్తిమీద పడితే వేయిరెట్లు సంతోషించేవాడు. కళ్ళల్లో మండుతూ, “ఏవిఁటీ? నువ్విలా తయారయావ్? ఏయింటో జనాభాకి ఆయింటో ఆనకట్ట కట్టిపారెయ్యాలని, ప్రభుత్వం సముద్రంలా ఘోషిస్తోంటే, కమిటీల్ని నియమిస్తూవుంటే! నలుగురు పిల్లలకంటె ఎక్కువుంటే ఒక్కోతలకి ఐదేసివందల రూపాయలు జరిమానా వసూలుచేసుకుంటారేమో! ఆలోచించావా? అయినా, నీ వ్యవహారమంతా మరీ మంకీయిజంలావుందిలే!”

వెంటనే సుందరమ్మకి జవాంబేం చెప్పాలో తెలీకపోవడానిక్కారణం, సంస్కార బలహీనతే. అంతో యింతో సిగ్గుపడుతూ, కాస్త రోషంగా “మీరు నాకు బుద్ధులు చెప్పనక్కరలేదులెండి!”

సుందరమ్మద్వారా తనలోకి వీచేగాలిలోవుండే లోపాలనీ, బలహీనతలనీ, అన్నింటినీ కలిపి, కుంకుడుకాయ పులుసులోవేసి రుద్దాలనీ అనిపించేది. ఆఖరికి సుందరమ్మతోసల్లాపాలాడుకోవడానిక్కూడా, ఆర్థికవ్యవస్థే కారణమనుకొనే సిద్ధేశ్వర్రావు డబ్బులేదని, సుందరమ్మకి దగ్గరగావెళ్ళడం విరమించుకునేవాడు.

సుందరమ్మ విసుక్కుంటూ, “ఒక సిల్కు రవికన్నా, ఒక బెంగుళూరు సిల్కుచీరెన్నా వుండేడిస్తేనా? ఎన్నాళ్లీ దరిద్రంతో చంపుతారో చంపండి! నాకు చదువురాదనేనా? ‘మీరింత నాటకమాడుతోంటు? చదువులేని గొడ్డునని, మీ యిష్టంవచ్చినట్టు చేసినా, వూరుకొంటున్నాను. మరో ఆడదైతే కోకలూ, రవికెలూ, నగలూ నాణ్యాలు తెచ్చి కాళ్ళముందు పడేసి దణ్ణం పెడితేగాని, మీరొక్క అడుగన్నా ముందు వేయగలరా? ఇంతకీ నాకు చదువురాదనేగా కారణం!’—అని మొత్తుకొనేది.

సిద్ధేశ్వర్రావు ‘కట్టుకొన్న పెళ్ళామే లంచమడుగుతుంటే మా ఆఫీసర్లుమాత్రం ఎందుకడగరూ? వాళ్లుమాత్రం ఏంతక్కువ తిన్నారు? మొన్న పదిరూపాయల ప్రమోషనుకే పచ్చ కాగితం, హారతికర్పూరంలా వెలిగిస్తేనేగాని, అయిందా?... పోన్లే...పోన్లే...’ అని నోరు మూసుకూరుకుని, ‘నీవుమాత్రం ఏం తక్కువదానివేమిటి? కమ్యూనిస్టులా నన్ను పీకి పాకంపెడుతున్నావ్!” అనేవాడు.

సుందరమ్మ ఎప్పుడన్నా “ఇజం”పేరు వినేసరికి భగభగలాడిపోయేది. సిద్ధేశ్వర్రావు ఐరోపావాళ్ళకంటే, అమెరికాకంటె, రష్యాకంటె, ముందుగానే ఎన్నో ఇజాల్ని కనిపెట్టి అమలు జరుపుతుండేవాడు. అవి నోటంట హఠాత్తుగా, జారి ముత్యాల్లాగ కిందపడి దొర్లుతుండేవి. అతను కనిపెట్టిన వాటల్లో ఫేమిలీజం, అఫీషయలిజం, సుందరమ్మిజం—ముఖ్యమైనవి.

ఒకనాడు ఆఫీసుకి, ఆలస్యంగా వెళితే మేనేజరు సంజాయిషీ అడిగాడు. సిద్ధేశ్వర్రావు తడుముకోకుండా, “డిలేయిజమండీ! డిలేయిజం. ప్రస్తుతం మన ఇండియాలో, ఆంధ్రాలో ఆఫీసుల్లో, ఫరమ్స్‌లో, దుకాణాల్లో, స్కూలుకుర్రాళ్ళలో, కాలేజీ స్టూడెంట్లలో అమల్లో వున్నదేనండి డిలేయిజం! ఇది ఇండియన్ పంక్చ్యుయాలిటీలో ప్రధానభూమిక నిర్వహిస్తోంది” అన్నాడు.

మరోనాడు కేషియర్నిచూస్తూ, “కేపిటలిజం మనీయిజంఅంతా మీనుంచే మాకురావాలి. ఎల్లప్పుడూ కమ్యూనిస్టులకీ, సోషలిస్టులకీ, మీ కేపట

లిజం మనీయిజం అవసరమొస్తూంటుందండోయ్!" అనేవాడు.

ఆరోజు సుందరమ్మ తలంటి పోసుకుని వీధిలో నుంచుని, ఆరబోసుకుంటోంది చిక్కు తీడ దీస్తూ, చూచేవాళ్ళని ఆకర్షించుకొంటూ.— సిద్ధేశ్వర్రావు ఆఫీసునుంచి తిరిగివస్తూ, ఈ దృశ్యం చూశాడు. తనలో తనకే తెలియని ఏదో భావం కలిగింది.

సుందరమ్మ సిద్ధేశ్వర్రావునుచూస్తూ, 'అయ్యో! అయ్యో! ఇంతతొందరగా వచ్చేశారేమండీ?' అంది. సిద్ధేశ్వర్రావు అన్నాడు. "అది ఎర్లీయిజం" అంటారులే గాని, నువ్వు వీధిలోనుంచుని తలార బోసుకుంటూంటే, ఎలావుందంటే, అలావుంది. మంది మార్కెటీజం, బజారీజ మనుకున్నావా? లోపలికి నడు. మంది "ఇన్నరిజం—"

సుందరమ్మ కొద్దో గొప్పో అలా అనబడినందుకు సిగ్గుపడింది. పైగా రవికలేకపోవడాన్ని జ్ఞాపకం తెచ్చుకొని, లోపలికి పారిపోయింది. పోయి వూరుకుందా?

"చూశారా? ఇవ్వాళ బియ్యంలేవు. కూరగాయలూ, ఉల్లిపాయలూ అన్నీ అయిపోయాయ్! సంతకెళ్ళిరండి. నెయ్యిమొహంచూచి, సంవత్సరమైంది సరిగదా నూనయినా తెచ్చి నా మొహాన పొయ్యండి. చింతపండు లేకపోతే బదులడిగి తెచ్చా. ఇంకా ఎన్నెన్నని తెమ్మంటారూ?"-అని సాగదీసింది.

సిద్ధేశ్వర్రావు, "అయితే ఇహానేం! అన్నీ బదులడిగి తేలేకపొయ్యావా? ఈజన్మలో కాకపొయ్యినా వచ్చేజన్మలో అయినాతీర్చిపారేదాం" అన్నాడు.

సుందరమ్మ విసుక్కుంటూ, "కొబ్బరినూనయినా తెస్తారా? తక్కువరకం వైటాయిలు కలిపింది తెండి! త్వరలో జుట్టూడిపోతుంది. బోడిముండకింద తయారయ్యాక "ఇకమీరు నూనే కొనక్కరలేదు. ఇదిగో ఇప్పటికే జుట్టు రోజుకి రెండేసి గుప్పెళ్ళూడిపోతున్నయ్! పిల్లల చింకి జుట్టు మీకళ్ళముందు చూస్తున్నారా? ఏవన్నా అంటే, బజారీజం, వల్లకాడీజం అని కాకిగోల చేస్తారు! నాకు రవికల్లేక, ఒక్కగానొక్కటుంటే ఆరేసి ఉట్టి నేవున్నాను—రేపు పురిటికి మా అమ్మనన్నా పిలవాలా? ఓపూట తిండన్నా పెట్టాల్గా? అవిణ్ణి పిలుస్తానంటే అభిమానం గౌరవం ప్రతిష్ఠ కొట్టొస్తయ్!"

సుందరమ్మ ఉపన్యాసం శ్రద్ధగా విన్నా వినకాపోయినా, సిద్ధేశ్వర్రావుకి భావశోష అర్థమయిపోయింది. ఫేమిలీజం అంటే ఏమిటి? ఇవిలేవు, అవితేవాలి, ఇవితేవాలి—అని సాగదీసేస్తుంటే, ఆడవాళ్ళకంటె కమ్యూనిస్టు నయమనిపించింది సిద్ధేశ్వర్రావుకి. కాస్త వ్యథిస్తూ, ఆడవాళ్ళల్లోనే కమ్యూనిజం బాగా పాకిపోయింది. ఎప్పుడూ అవిలేవివిలేవనే హక్కులంటూ, తిండీ, బట్టా అని గోలెడుతూంటే—కమ్యూనిజం ఆడవాళ్ళల్లోంచే పుట్టిందా అనిపిస్తోంది" అని ఆ జీవుడు గోలెడితే సుందరమ్మ కాస్త నిదానించి చూచింది. కేపటలిస్టులు వారసు లెక్కువై పోయి, ఎక్కడ నాటూ నిష్పత్తులు తలకుమించిపోతాయో అని "సంతానం వద్దు మొర్రో!" అంటూ గోడుపెడతారు. శిశుహత్యలూ, భ్రూణహత్యలూ చేస్తుంటారు.

సిద్ధేశ్వర్రావు తన భార్య బారినుంచి తప్పించుకోడానికి, ఎన్నెన్నో గాలి దుర్గాలు కట్టాడు. అన్నీ ఒక్క సుందరమ్మ మాటనే, ఆటంబాంబుతో ఫెళఫెళవిరిగి తనమీద పడిపోయేవి. సుందరమ్మ విజయపతాక ఎగిరిస్తూ తనకెన్నడూ లేని, అశాంతి చెలరేగించేది. ఇదివరలో సుందరమ్మ ఎక్కడి కెవతానన్నా, "మీ బాబు నడుగు, మీ అమ్మనడుగు" అని కాటుక కంటి నీరు తుడిచేవాడు.

ఇక ఉండబట్టలేక నెలలు దగ్గిర పడుతోంటే సుందరమ్మ ఓనాడు తల్లికి, ఇంట్లో పరిస్థితులన్నీ, సమస్యలన్నీ తుచ తప్పకండా రాసిపారేసి, నేను నడి సముద్రంలో వున్నాను. మీ అల్లుడు నన్ను ఒడ్డుకి చేర్చడు. ఏవన్నా కన్నకూతురనే అభిమానం వుంటే రెక్కలు కట్టుకురావాలి. వచ్చేటప్పుడు రొండొందలకి తక్కువ కాకుండా తేవాలి-లేకపోతే ఉరితీసుకు చస్తానని బెదిరించి ఉత్తరం రాసింది.

తల్లి మంగమ్మ విషయంలో ఈ ఉత్తరం అమోఘాస్త్రంగా పనిచేసింది. చెయ్యడమేమిటి తడవుగా, మెళ్ళో పులిచేరు నాను, జిగినీగొలుసు,

చండకష్టే తాకట్టు పెట్టి. రొండొందలూ పట్టుకొని ఎగిరెగిరి వచ్చింది. తల్లీ కూతుళ్లిద్దరి కిద్దరూ వచ్చావా? అంటే వచ్చావా? అనుకోవడం, ఒకళ్లనొకళ్లు కౌగలించుకోవడం, ఏడవడంకింద సాగించారు.

"అయిన డబ్బంతా ఏంజేస్తున్నాడే?"

"మగవాళ్లు మనకి చెబుతారటే అమ్మా! నెలకి, బియ్యం, పప్పూ అన్నీ కొంటారంతే! సిగరెట్లకి, కాఫీలకి, స్నేహితులకీ—ఏంచేస్తారో నాకు తెలీదమ్మా! అద్దె నెలకి ఇరవై బిళ్ళలు పొయ్యాలిసిందేనా? ఇక మిగిలేది ఏవుంటుంది?"

"అంతేలే"-ఆ మంగమ్మ మరి ప్రశ్నించలేదు.

సాయంకాలం సిద్దేశ్వర్రావు మంగమ్మగారి రాక గమనించి, ఈ తగులాటం ఎందు కొచ్చిందిరా? బాబూ! అనుకున్నాడు. ఇంట్లో సమస్యలన్నీ నాగుబాములమల్లే పడగలెత్తి, తన్ని కాటేయడానికి బుసలుగొడుతున్నయ్! ఇలాంటి సమయంలో, ఒక గుర్రపు పందెం, ఒక పేకాట, లాటరీ, బ్రాకెట్టు-హఠాత్తుగా డబ్బొచ్చి, మీద పడిపోయే పీటినిగుర్తిస్తూ, అప్పుడప్పుడు బ్రాకెట్టు కంపెనీకి వెళ్ళి నోట్లు తెచ్చుకుంటూన్న, కేషియర్నీ, తోటిగుమాస్తాని చూచి ఉడుక్కునేవాడు. వాళ్ళిద్దరూ, గోలగా నవ్వుతూ, చేవలేదనేవారు. వాళ్లు కొత్తనోట్లు కట్టలు లెక్కపెట్టుకుంటే తన కళ్ళు కుట్టేసేవి.

నెమ్మదిగా కేషియరుతో వెళ్ళి కంపెనీలో చేరాడు. పది పదిహేను నెంబర్లుమీద రోజూ కాసేవాడు. రెండో వారంలో అదృష్టం తన దగ్గిరకొచ్చి పలకరించింది. చెయ్యి చూపించాడు. ఈ వారం పంద రూపాయలు లాటరీలో గెలుస్తావ్ అని జవాబొచ్చింది. వ్యాపారం రూపాయల్లోకి దింపాడు. వచ్చేటపుడు మెదలకండా వచ్చేవి. పది రూపాయలు వచ్చేసరికి, పాతిక రూపాయలు పరారీ! పట్టుదలెక్కువై పోయి, కుస్తీ పట్టుపట్టడం మొదలుపెట్టాడు. ఒకసారి, పది రూపాయలకి ఏభయి రూపాయలు, జరజరమని చేతిలోకొచ్చాయ్! ఆ యాభై రూపాయలు బ్రాకెట్టాడేసేడు.

మంగమ్మ ఇంట్లో, అలమారాలో పెట్టే డబ్బు పిల్లులూ, ఎలుకలూ తింటూన్నట్టు మాయమైపోతుంటే గోలపెట్టేది. సిద్ధేశ్వర్రావు తనేం ఎరగనట్టు చేతులు కడుక్కుని, ఆఫీసుకు జారిపోయేవాడు.

బ్రాకెట్ల వ్యసనం బాగా మత్తు మందల్లే పని చేసింది. ఆ వచ్చే నెంబర్లతో బుర్రలు గిరగిర తిరిగిపోయాయ్! వాటికన్నా బొంగరాలు నయం. ఒకో అప్పుడు కేషియరూ, హెడ్డు గుమాస్తా పందేసి రూపాయలుదాకా కాస్తోంటే, బిక్కముహం వేసుకు చూచేవాడు. తన దృష్టిలో ఈ బ్రాకెట్ల వ్యాపారంలో, మేడలు కట్టినవాళ్లున్నారు, అడుక్కుతింటూవున్నవాళ్లున్నారు.

అంత డబ్బూ ఖర్చుకాగా, మంగమ్మ ఇక వున్న ఏభైతో చీరలూ, పిల్లలకీ చొక్కా గుడ్డలవీ కొని తెప్పించుదామని స్నానాని కెళ్ళింది.

సిద్ధేశ్వర్రావు వాటికి సిద్ధియోగం సిద్ధింపించి, జాగ్రత్తగా పట్టుకెళ్ళి కేషియర్‌తో వాళ్ళతో



బ్రాకెట్ల కంపెనీలో దూరాడు. మద్రాసు గిండీరేసుల్లేనివాళ్లింకేం చేస్తారు? (బ్రాకెట్లమధ్య ఉంటూంటారు.)

మంగమ్మ వచ్చి చూసుకుని నెత్తీ నోరూ మొత్తుకుంది. సిద్ధేశ్వర్రావు, ఏం ఎరగనట్టు, ఏభై రూపాయలు నీ కెక్కడివి!" అని గద్దించాడు.

మంగమ్మ వళ్లు అట్టుడిన ట్టుడికింది. ఇంత కాలం ఎవరి సొమ్ము తింటున్నావని? నా సొమ్ము ఏభై రూపాయలూ, పోతే ఎక్కడివని, అడుగుతావా? దరిద్రుడికి తలంటుపోతే, వడిగళ్ళ వానట! ఎందుకొచ్చింది నాయనా! ఇబ్బందిగా వున్నారంటే డబ్బు తెచ్చాను. ఆ డబ్బంతా ఏట్లో కలిపేశాను. అలమారా తీసివుండంతో ఏ దొంగ ముండా వాడు గదిలోదూరి కాజేశాడో? ఒకటా రెండా, ఏభయిరూపాయలు" అని నెత్తీ నోరు మొత్తుకొంది.

"ఇంకా ఏవన్నా వున్నాయా?" అన్నాడు. బ్రాకెట్లలో డబ్బు వచ్చిందంటే, ఒక్కసారే డబ్బంతా ఆ మంగమ్మ ముహాన కొట్టాలనిపించింది.

"తెచ్చిన రొండొందలూ మీ మొహానే పోశాను" అంది మంగమ్మ.

సుందరమ్మ ముఖం చిట్లించుకొంటూ, "మా మొహానెందుకు పోశావమ్మా? మేమేవన్నా అయ్యేవాళ్ళమా? చచ్చేవాళ్ళమా? మా మొహానెందుకు పొయ్యడం? నేనేమన్నా తెమ్మని, మా నెత్తిన పొయ్యమన్నానా? మా నెత్తినపోసి, మమ్మల్ననడం ఎందుకు?" అంది.

మంగమ్మ రాగాలు సాగదీసింది. ఇలాంటి దాని వసుకోలేదంది. మొగుణ్ణిముందేసుక్కూచుంటే రాక నేపోనంది. ఆయిన పులిచేరునాను, దండపట్టీ జిగినీగొలుసు ఏట్లో కలిసిపోయాయంది. ఇక ఈ గడప తొక్కనంది. వాడుకొన్న రొండొందలూ ఇస్తేనేగాని గడప దాటనంది.

సుందరమ్మ విసవిసలాడుకుంటూ వెళ్ళి, "ఆవిడ డబ్బు మనకెందుకూ? ఇచ్చెయ్యండి! తలకాయలన్నా తాకట్టుపెట్టి ఆ రొండొందలూ, ఆవిడమొహాన కొట్టేయండి! ఎలాగైతేనేం? బోడి రొండొందలూ తెచ్చింది. బోడి రొండొందలూ! పౌరుషంగా బతికేవాళ్లమయితే, ఆవిడనే మాటలుపడ్డానికి వీల్లేదు" అంది.

"ఐతే ఆ డబ్బంతా ఆవిడమొహాన కొట్టెయ్యడానికి, కొంతకాలం పడుతుంది ఆగమను. గడ్డిలాగ వడ్డీ పెరిగినా సరే, ఆ మొగాన కొట్టేసి మునుగేసి పంపిద్దాం" అన్నాడు సిద్ధేశ్వర్రావు.

"ఆవిడ వెళ్ళిపోతే ఎలాగండీ? రేపొద్దున పురుడొస్తే..."

"హాస్పిటల్ జాయిన్ చేస్తాను. లేకపోతే మీ అమ్మ మరో రొండొందలు తీసుకొచ్చి మనింటో వుండానికి నా కేవిధమైన అభ్యంతరంలేదు—అదీ కాకండా ఆవిడకీ మనకీ పడదు. ఆవిడ కేపట లిస్టు నీ పురుళ్ళన్నింటికీ, ఆవిడేగా పెట్టుబడి పెడత! మన మావిడనుంచి కానీ పుచ్చుకోడానికి వీల్లేదు పుచ్చుకొంటే వడ్డీ గడ్డిలా పెరుగుతుంది. నేను బ్రాకెట్ లాటరీలో సంపాదించేదంతా, ఆవిడ మొహాన కొట్టాలి."

సుందరమ్మ గోలపెడుతూ, "ఈ వెధవ లిస్టులతోనే మన సంసారం ఇంతవరకూ లాక్కొచ్చారు. ఈసారి ఇక 'ఇజా'ల్ని గురించిగాని, ఇస్టుల్ని గురించిగాని వాగేరంటే నేనొప్పుకోను" అంది.

మంగమ్మ ఈ సంభాషణంతా వింది. ఇంకేవుంది? సిద్ధేశ్వర్రావుమీద విరుచుకుపడింది. రొండొందలూ ఇస్తే ఇచ్చారు. ఇక్కడ ప్రాణాయామం పెట్టుక్కూచుంటానని అటూ ఇటూ గోలగా తిరగడం మొదలెట్టింది.

"ఏదో కష్టంలోవున్నారంటే పట్టుకొచ్చాను గాని, బ్రాకెట్లకనీ లాటరీలకనీ, ముండలకనీ అంటే తెచ్చానా?" అని సిద్ధేశ్వర్రావుకి శాపాలు మొదలుపెట్టింది. సిద్ధేశ్వర్రావు పెద్దపెట్టున, ఓండ్ర పెడుతూ, "చూశావా? చూశావా? మీ అమ్మదంతా డాంకీయిజం డాంకీయిజం!" అన్నాడు.

ఇంతలో కేషియర్ బయటనుంచి కేక పెట్టాడు 'నెంబరొచ్చిందోయ్' అని.

ఇంకేవుంది? ఇంకేవుంది?—సిద్ధేశ్వర్రావుకి, సుందరమ్మనీ పిల్లల్నీ భుజాలమీదెక్కించుకుని డాన్సుచేస్తూ భూప్రదక్షిణం చేయాలనిపించింది!